క్లుప్తంగా

ఏకేయూలో జంగిల్ క్లియరెన్స్

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీలో జంగిల్ క్లియరెన్స్‌ను యూనివర్శిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్ సోమవారం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు తొలగించి ఆవరణను అందంగా, ఆహ్లాదకరంగా మార్చడం అభినందనీయమని అన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.హర్షప్రీతమ్‌దేవ్ కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు అవుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.సోమశేఖర్, డీన్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.వెంకట్రావు, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశోధన పత్రంపై అవగాహన

ఒంగోలు: కృత్రిమ మేధస్సు వినియోగించి పరిశోధన పత్రం రచన ఎలా చేయాలనే దానిపై స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుజ్జుల రాఘవేంద్ర ప్రత్యేక అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, పరిశోధన, అభివృద్ధి డీన్ డి.అనీల్‌కుమార్, తదితరులు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

మహిళలు కీలకంగా పనిచేయాలి

ఒంగోలు సెంట్రల్: బీజేపీ విజయానికి మహిళలు కీలకంగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయి మహిళా మోర్చా బాధ్యులు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఒంగోలులో శక్తి వందన్, మహిళా స్వయం సహాయక సంఘం, ఎన్‌జీఓ సంపర్క్ అభియాన్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా సోషల్ మీడియా ఇన్‌చార్జి గాయిత్రి, రాష్ట్ర ఎన్‌జీఓ సంపర్క్ అభియాన్ మాధవి, మహిళా మోర్చా జోనల్ ఇన్‌చార్జి లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు జజ్జర క్రిష్ణవేణి, మహిళా మోర్చా జిల్లా ఇన్‌చార్జి తీగల సత్యవతి, జిల్లా కార్యదర్శి కోటేశ్వరి, లక్ష్మీదేవి, శివకుమారి, విజయరావు, శ్రీలక్ష్మి, అజంతాలు పాల్గొన్నారు.

ఆహార భద్రత, నాణ్యత పాటించాలి


మాట్లాడుతున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి: ఆహారాన్ని సరఫరా చేసే యజమానులు ఆహారం పరిశుభ్రత, నాణ్యత పాటించాలని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం చీమకుర్తిలో హోటళ్లు, పండ్ల దుకాణాలు, బేకరీలు, ఇతర ఆహారాలు సరఫరా చేసే యజమానులకు ఆహార భద్రత, నాణ్యతపై ఫుడ్ సేఫ్టీ అధికారుల సమక్షంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ యశోద మాట్లాడుతూ ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఆహారాన్ని సరఫరా చేసే సంస్థల యజమానులు పాల్గొన్నారు.

10న సహకార గృహనిర్మాణ సంఘ మహాజన సభ

ఒంగోలు అర్బన్: స్థానిక ఎన్‌జీఓ హోంలో ఒంగోలు తాలూకా ఎన్‌జీఓ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మహాజనసభను ఈ నెల 10వ తేదీ నిర్వహించేందుకు పాలకవర్గం నిర్ణయించినట్లు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు మహ్మద్ పాషాఖాన్, ఎస్‌కే మగ్బుల్ షరీఫ్, సీహెచ్ సింగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో స్థల ధర నిర్ణయం, నోటిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ నామ్స్, ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

గణిత పరీక్షలో శ్రీసూర్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

ఒంగోలు: రామచంద్రాపురంలోని రామానుజన్ అకాడమీ నిర్వహించిన గణిత పోటీ పరీక్షలో స్థానిక అన్నవరప్పాడు శ్రీసూర్య విద్యానికేతన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్రీరామాల వెంకటరామిరెడ్డి తెలిపారు. 5వ తరగతి విద్యార్థి ఎం.జస్వంత్ జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి, నాలుగో తరగతి విద్యార్థి కె.చైతన్య రాష్ట్రస్థాయిలో తృతీయ, 8వ తరగతి విద్యార్థి పి.జెస్సు తృతీయ, 9వ తరగతి విద్యార్థి కె.ఏకాంకిత తృతీయ బహుమతి సాధించారని వివరించారు. ఇంకా ఏడుగురు విద్యార్థులు ప్రత్యేక బహుమతి సాధించినట్లు తెలిపారు. విజేతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీఎస్ఆర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అధికారులు


బాధ్యతలు స్వీకరించిన ఎస్సై బ్రహ్మనాయుడు


మద్దిపాడు నూతన తహసీల్దార్ భవానీశంకర్


కొత్తపట్నం తహసీల్దార్ సురేష్

నాగులుప్పలపాడు : ఎన్నికల బదిలీల్లో భాగంగా నాగులుప్పలపాడు మండలానికి కేటాయించిన అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా జీఎస్‌డబ్ల్యూ అధికారిగా పనిచేస్తున్న వై.మహాలక్ష్మి బదిలీపై వచ్చి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కొనకనమిట్ల మండలం ఎస్సైగా పనిచేసి నాగులుప్పలపాడుకు బదిలీపై వచ్చిన బ్రహ్మనాయుడు విధుల్లో చేరారు. 8 నెలల క్రితం తహసీల్దార్‌గా నాగులుప్పలపాడు మండలానికి వచ్చిన సుజన్ కుమార్‌ను తిరిగి ఇక్కడే తహసీల్దార్‌గా కేటాయించడంతో మళ్లీ నాగులుప్పలపాడు మండల తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

మద్దిపాడు: మద్దిపాడు తహసీల్దార్‌గా ఎం.భవానీ శంకర్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా ముప్పాళ మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న భవానీశంకర్ మద్దిపాడుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే కార్యాలయ సిబ్బందితో సమావేశమై ఎలక్షన్ సెల్‌కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డీటీ ఆకాజ్యోతి, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కొత్తపట్నం తహసీల్దార్

కొత్తపట్నం: మండలానికి నూతన తహసీల్దార్‌గా నియమితులైన ఎస్.సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల రెవెన్యూ అధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలో విధులు నిర్వహిస్తూ ఎన్నికల నేపథ్యంలో కొత్తపట్నం మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 41,901 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 20,509 మంది, స్త్రీలు 21,392 మంది ఉన్నారని తెలిపారు. 95 శాతం ఆధార్ సీడింగ్ అయిందని, డబుల్ ఎంట్రీలు తొలగించడం, డెత్‌లు తొలగించడం, పేర్లు, ఇంటి పేర్లు సరిచేయడం జరిగిందని వివరించారు. బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రి మేరుగు నాగార్జునను సన్మానిస్తున్న ఎస్సీ నాయకులు, కార్యకర్తలు

మంత్రి మేరుగును కలిసిన ఎస్సీ నాయకులు

మద్దిపాడు: రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జునను ఒంగోలులోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మద్దిపాడు మండలంలోని ఎస్సీ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు మాట్లాడుతూ అందరినీ కలుపుకుని పోతామని, అదే క్రమంలో నియోజకవర్గంలో పార్టీని ఏకతాటిపై నడిపించడానికి ప్రయత్నిస్తున్నానని తెలిపారు. అందరి సహకారం తీసుకుని పార్టీని బలోపేతం చేస్తానని చెప్పారు. పార్టీకి పనిచేసేవారిని వదలబోనని స్పష్టం చేశారు. పార్టీ పరంగా సంతనూతలపాడు నియోజకవర్గం బలంగా ఉందని, చిన్న చిన్న అవాంతరాలు ఉంటే తాను అందరితో మాట్లాడి సమన్వయం చేసుకుంటానని తెలిపారు. అనంతరం మాదిగ సామాజికవర్గం నాయకులు మంత్రిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, సీనియర్ నాయకుడు తేళ్ల పుల్లారావు, దుడ్డు వినోద్‌కుమార్ కొలచనకోట సర్పంచ్ డొక్కా మరియమ్మ భర్త సిద్దయ్య, మాజీ ఎంపీటీసీ భర్త అనపర్తి చిరంజీవి, బోడిపోగు యాకోబు, కావూరి ఏసోబు, దాసరి రాజు, యోహాను, ప్రతాప్, రవికుమార్, కందుల వెంకటేష్, తేళ్ల ఏసురత్నం, మండలంలోని వివిధ గ్రామాల ఎస్సీవర్గాల నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను సన్మానించిన వైఎస్సార్ సీపీ డివిజన్ల అధ్యక్షులు

ఒంగోలు సబర్బన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఒంగోలు నగర కమిషనర్ ఎం.జస్వంతరావును నగరంలోని వైఎస్సార్ సీపీ డివిజన్ల అధ్యక్షులు సన్మానించారు. స్థానిక కమిషనర్ చాంబర్‌లో సోమవారం కలిసి ఆయా డివిజన్లలోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ 47వ డివిజన్ అధ్యక్షుడు చావలి శ్రీనివాసరావు, 6వ డివిజన్ అధ్యక్షుడు చింతలపూడి నాగబాబు, 10వ డివిజన్ అధ్యక్షుడు గంగాడి శ్రీనివాసరావు, 13వ డివిజన్ అధ్యక్షుడు సూర్య రాజేష్, 16వ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, 36వ డివిజన్ అధ్యక్షుడు పిడపర్తి మధుసూదన్‌రెడ్డి, 37వ డివిజన్ అధ్యక్షుడు గునూపాటి వెంకారెడ్డి, 48వ డివిజన్ అధ్యక్షుడు పసుపులేటి వీరభద్రరావు ఉన్నారు.


కమిషనర్ జస్వంతరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నగర డివిజన్ల అధ్యక్షులు

10న నవోదయ ప్రవేశ పరీక్ష

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పీఎం జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 9వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 10న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. 9వ తరగతిలో చేరే విద్యార్థులకు జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ మార్కాపురం, జెడ్పీహెచ్‌ఎస్ గరల్స్ మార్కాపురం, జెడ్పీహెచ్‌ఎస్ రాయవరంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు కలుజువ్వలపాడులోని జవహర్ నవోదయ విద్యాలయం, రాయవరం ఏపీఎస్ డబ్ల్యూఆర్‌జేసీలో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోలేని వారు జవహర్ నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చెప్పాడంటే..చేస్తాడంతే!


శివప్రసాద్‌రెడ్డిని ట్రైసైకిల్ అడుగుతున్న బాధితుడు


ట్రైసైకిల్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: పట్టణంలోని ఒకటో వార్డులో సోమవారం నిర్వహించిన ప్రచారంలో దివ్యాంగులైన ఇట్లా చెంచుబాబు, నాగులూరి శ్రీనులు తాము వికలాంగులమని తమకు ట్రైసైకిళ్లు కావాలని కోరారు. వెంటనే స్పందించిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హుటాహుటిన బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లు తెప్పించి ఇద్దరికి రెండు సైకిళ్లు అందజేశారు. దీంతో కాలనీ వాసులు శివప్రసాద్‌రెడ్డి దాతృత్వానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు శివప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

క్రిస్టియన్ అని కూడా నమోదు చేయాలి

కొత్తపట్నం: కులగణనలో మతం కాలమ్‌లో క్రిస్టియన్లకు క్రిస్టియన్ అని కూడా నమోదు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డికి సోమవారం మండల పాస్టర్స్ యూనియన్ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీపీఎఫ్ జిల్లా సెక్రటరీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ మండలంలో సుమారు 80 మంది పాస్టర్లు చర్చిలు నడుపుతూ సంఘ కాపరులుగా ఉంటున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తొమ్మిదో కాలంలో మతం దగ్గర క్రిస్టియన్ అని నమోదు చేయాలని అడిగితే.. సదరు సచివాలయ సిబ్బంది బీసీ (సీ) సర్టిఫికెట్ ఉంటేనే నమోదు చేస్తామని, లేకపోతే వీలుకాదని చెప్పారని వివరించారు. ఈ విషయంపై స్పందించి మతం దగ్గర క్రిస్టియన్ అని నమోదు చేయించేందుకు షరతులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధనరాజ్, జాషువ, సైలస్‌పాల్, సురేష్, రాంజేంద్ర, పీటర్, సుగుణరావు, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పాస్టర్లు

నేషనల్ డీవార్మింగ్‌పై అవగాహన

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాలలో నులిపురుగుల నివారణపై హెచ్‌ఎం మౌలాలీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నులిపురుగుల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లను వాడాలని, గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని హెచ్‌ఎం సూచించారు. ఈనెల 9వ తేదీన పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందిస్తామని ఆశా వర్కర్ జె.విక్టోరియారాణి తెలిపారు.

నేడు 'మన ఊరికి మన శివన్న'

కురిచేడు: మన ఊరికి మన శివన్న కార్యక్రమం మంగళవారం సాయంత్రం జరుగుతుందని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు పాల్గొంటారని పేర్కొన్నారు. తొలుత హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట తూర్పు హరిజనవాడకు వెళ్లే దారికి రూ.5 లక్షల జెడ్పీ నిధులతో పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆ తర్వాత పడమర హరిజనవాడలో ప్రజలతో మాట్లాడతారని, క్రిస్టియన్ పాలెం లో 5 లక్షల రూపాయలు జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, రూ.15 లక్షలతో అంతర్గత పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన, వాల్మీకి బజార్‌లో రూ.10 లక్షలతో సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన, ఈరన్న స్వామి దేవాలయం వద్ద వాల్మీకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన ఈద్గా ప్లాట్‌ఫారం, ప్రహరీ పనులను ప్రారంభిస్తారు. మండలంలోని ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కమిటీల అధ్యక్ష,కార్యదర్శులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు 100 సూత్రాల పుస్తకాల పంపిణీ

అల్లూరు (కొత్తపట్నం): యండమూరి రచించిన మొదటి ర్యాంకుకు 100 సూత్రాల పుస్తకాలను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత జడ్జి వి.నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మారెళ్ల సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. యండమూరి రచించిన వంద సూత్రాల పుస్తకాన్ని బాగా చదివి మంచి మార్కులతో స్కూల్‌కు, తల్లిదండ్రులకు పేరు తేవాలని కోరారు. చెడు స్నేహాలకు, అలవాట్లకు బానిసలు కాకుండా సెల్‌ఫోన్‌లకు, టీవీలకు దూరంగా ఉండి ఉపాధ్యాయులు చెప్పే చదువులు శ్రద్ధగా అర్థం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవ్వాలని కోరారు. ప్రముఖ మెజీషియన్ బి.వి.రామన్ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ ఆలోచనతో ఉండాలని తెలిపారు. మ్యాజికల్ రూపంలో విద్యార్థులను చైతన్య పరిచాడు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పసుపులేటి నరసింహారావు, పాఠశాల హెచ్‌ఎం కె.చిన్న వెంకటసుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

పాఠశాల ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయాలి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణను గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకోవడంతో వారికి నోటీసులు జారీ చేసి స్థలాన్ని ఖాళీ చేయించనున్నట్లు తహసీల్దార్ కెవిప్రసాద్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కేవీ ప్రసాద్ గ్రామానికి చేరుకొని ఆక్రమణ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులతో మాట్లాడారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తక్షణమే ఆక్రమణ పాఠశాల స్థలాన్ని ఖాళీ చేయాలని సూచించారు. లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖాళీ చేసేందుకు మూడు రోజులు సమయం కావాలని కోరగా అందుకు సంబంధించి వారి నుంచి రాతపూర్వక హామీ తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, కమిటీ చైర్మన్ అమల, వీఆర్వో రమణారెడ్డి, మహిళా పోలీస్ త్రివేణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి

గుడ్లూరు: కుష్టు వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా లెప్రసి, టీబీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఖాదర్‌వలీ సోమవారం తనిఖీ చేశారు. వైద్యశాలలో లెప్రసి, టీబీ రోగులకు సంబంధించిన రికార్డులను, మందుల రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా 60 ఏళ్లు దాటిన వారికి ఈ నెలలో బీసీజీ వ్యాక్సినేషన్ వేస్తామన్నారు. కార్యక్రమంపై అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ఎవరికైనా చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే వారి వివరాలు నమోదు చేసి వైద్యశాలకు పంపించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు అందజేయాలన్నారు. కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్,వైద్యాధికారిమారుతీరావుపాల్గొన్నారు.


గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిష్టర్లు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వళి

వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శించిన తాటిపర్తి

యర్రగొండపాలెం: మండల సచివాలయాల కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకుడు సయ్యద్ జబీవుల్లాను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తున్న సమయంలో జబీవుల్లాకు గుండెనొప్పి వచ్చింది. వెంటనే గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో స్టంట్ వేయించుకొని ఇంటికి తిరిగి వచ్చారు. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ముందుగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆ తర్వాత ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. జబీవుల్లాను పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సొసైటీ అధ్యక్షుడు మేడగం వెంకటరెడ్డి, మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, వెన్నా మోహన్‌రెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


జబీవుల్లాను పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

దుర్గా సమేత భోగేశ్వరస్వామికి శాంతి కల్యాణం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో దుర్గా సమేత భోగేశ్వరస్వామి శివాలయంలో మూడో వార్షికోత్సవం సందర్భంగా భక్తిశ్రద్ధలతో భక్తులు సోమవారం పూజలు చేశారు. అర్చకుడు మేడవరం రాఘవేంద్ర ఆధ్వర్యంలో శివలింగంకు గణపతి పూజ, అభిషేకాలు, చండీ హోమాలు తదితర పూజలు నిర్వహించిన అనంతరం శివలింగాన్ని పూలమాలలతో అలంకరించారు. రాత్రి దుర్గా సమేత భోగేశ్వరస్వామి వారికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాంతికల్యాణం నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి శాంతికల్యాణం తిలకించారు. ఆలయం ప్రాంగణంలో చిన్నారులతో కోలాటం ప్రదర్శించారు.

ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలి

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణం వలన ఇళ్లు కోల్పోతున్న వారికి వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని కర్లపాలెం గ్రామస్తులు తెలిపారు. ఇళ్ల స్థలాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కర్లపాలెం గ్రామస్తులు పోర్టు వద్ద సోమవారం నిరసన చేపట్టారు. పోర్టులో జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మీరయ్య, రమణయ్య, శేషయ్య, గ్రామ కాపులు మాట్లాడుతూ కర్లపాలెం గ్రామస్తులకు పొలాలకు నష్టపరిహారం మాత్రమే అందించి ఇళ్ల స్థలాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీ.రెడ్డిలు అక్కడకు చేరుకొని గ్రామస్తులుతో చర్చలు చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోర్టు నిర్మాణ పనులకు ఆటంకం కలిగించవద్దన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

దర్శి: నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి లోపాలపై చర్చిస్తున్నామని ఎలక్టోరల్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం సమావేశం జరిగింది. లోకేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 282 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏర్పాట్లపై చర్చిస్తున్నామన్నారు. ఐదు మండలాలకు 35 సెక్టార్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రజలందరికి ఈవీఎంలు, వీవీ పాట్‌లు పని చేసే విధానంపై అవగాహన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామని చెప్పారు. ఎస్సై శివన్నారాయణ, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లోకేశ్వరరావు

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

మార్కాపురం: రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఏఎంసీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్‌ను జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మార్కాపురం ఏఎంసీ నూతన కమిటీ చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు పీఎల్‌పీ యాదవ్, శారద రంగస్వామి గౌడ్‌ను సోమవారం యార్డు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, సాధన విద్యా సంస్థల డైరెక్టర్ జి.రమేష్‌బాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.


ఏఎంసీ చైర్మన్ షంషేర్‌ను సన్మానిస్తున్న డీఎల్‌డీఓ సాయికుమార్, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి

అదుపుతప్పి లారీ బోల్తా

కంభం: లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున స్థానిక హైవే రోడ్డుపై జరిగింది. వివరాలు.. మార్కాపురం నుంచి గిద్దలూరు వెళ్తున్న ఓ లారీ స్థానిక హైవే రోడ్డుపై ఉన్న యూటర్న్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

నిత్యావసరాలు పంపిణీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రోడ్డు మానసిక వికలాంగుల పాఠశాలకు, కొంగలవీడురోడ్డు అమ్మ ఆశ్రమంలోని నిర్వాహకులకు సోమవారం ముక్కెర కాశిరెడ్డి ఆర్థిక సహాయం మేరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకుడు బీఎస్ నారాయణరెడ్డి నిత్యావసరాలు అందజేశారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలనే మంచి మనస్సు ప్రతి ఒక్కరికి కలగాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు దుగ్గా రాజశేఖర్‌రెడ్డి, గిరిధర్ యాదవ్, అమ్మ ఆశ్రమం నిర్వాహకురాలు తిరుపతమ్మ, వికలాంగుల పాఠశాల నిర్వాహకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళా మంచి అవకాశం

గిద్దలూరు రూరల్: నిరుద్యోగులకు జాబ్‌మేళా మంచి అవకాశమని సాయిచైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీ సిటీ ఇండస్ట్రియల్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు 121 మంది హాజరు కాగా అందులో 48 మందిని ఎంపిక చేసి ఉద్యోగావకాశాలు కల్పించారు. హెచ్ఆర్ ఎస్.రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.